విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

సీపీఐ జిల్లా సమితి సమావేశాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చింతపల్లి: చింతపల్లిలో ఈ నెల 20న నిర్వహించనున్న భారత కమ్యునిస్టు పార్టీ అల్లూరి జిల్లా సమితి, కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. ఆ పార్టీ మండల కార్యదర్శి పేట్ల పోతురాజుతో కలిసి శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ సీనియర్ నేత, కామ్రేడ్ దివంగత గంధం నర్సింగరావు ఇంటి ఆవరణలో నిర్వహించ తలపెట్టిన అల్లూరి జిల్లా సమితి, కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి హాజరు కానున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా సమితి సభ్యులు, అదే విధంగా కార్యవర్గ సభ్యులందరూ విధిగా హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సీఎస్‌డబ్ల్యు నుండి ఆశాగా ప్రమోట్ చేయాలి

విశాలాంధ్ర - అనంతగిరి: సీఎస్‌డబ్ల్యూ నుండి ఆశాలుగా ప్రమోట్ చేయాలని కోరుతూ అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి సీఎస్‌డబ్ల్యూలు శుక్రవారం పాడేరు ఐటీడీఏలో జరిగిన గ్రీవెన్స్‌లో విన్నవించారు. పదేళ్ల కాలం నుండి సిఎస్‌డబ్ల్యూగా పనిచేస్తున్నామని తమకు ప్రభుత్వం చాలీచాలని వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారని అన్నారు. ఆశాగ ప్రమోట్ చేయాలని బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు లక్ష్మీ, పద్మ, సునీత, కాంతమ్మ, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న నీరు

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో కొంగ శింగి గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన పైప్ లైన్ ద్వారా నీరు గత మూడు రోజుల నుండి వృథాగా పోతోంది. అయినా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొంగ శింగి గ్రామానికి చోద్యం గ్రామం నుండి గతంలో పైపు లైన్ ఏర్పాటు చేశారు. అయితే ఆ పైప్ లైన్ కొంగశింగి వెళ్లే రహదారిలో పెద్ద రంధ్రం ఏర్పడి గత మూడు రోజుల నుండి నీరు పోతున్న విషయం పంచాయతీ పాలకవర్గానికి తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొంగ సింగి గ్రామస్తులకు దాహార్తి తీర్చే ఈ పైపులను మరమ్మతులు చేపట్టి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు

విశాలాంధ్ర - కె.కోటపాడు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. అండర్ 14, అండర్ 17 విభాగంలో బాలురు బాలికలకు నియోజకవర్గ స్థాయి ఎంపికకు సెలక్షన్స్ ఏర్పాటు చేశారు. ఈ పోటీలను ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతోపాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. శారీరకంగా, మానసికంగా, దృఢంగా తయారవ్వాలంటే ఆటలు ఎంతో అవసరమని అన్నారు. కె.కోటపాడు మండలం నుండి ఆరు ప్రభుత్వ పాఠశాలలు రెండు ప్రైవేటు పాఠశాలల నుండి పోటీలకు విద్యార్థులు హాజరయ్యారని ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి తెలిపారు. కోకో, కబడ్డీ, వాలీబాల్, త్రో బాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించామని, ఇందులో ఎంపికైన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1, 2 సత్యనారాయణ, ప్రసాద్, లంక వాని పాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు, సూదివలస ఎంపీటీసీ వగ్రి రామునాయుడు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ పార్కుల్లో ప్రవేశ రుసుములు డిజిటలైజేషన్

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ పరిధిలో నిర్వహిస్తున్న పార్కులు, మ్యూజియం లు తదితర ప్రదేశాలలో ప్రవేశ రుసుముల చెల్లింపులు డిజిటలైజేషన్ చేస్తున్నట్లు ఇన్ఛార్జి మెట్రోపాలిటన్ కమిషనర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం ఉదయం వీఎంఆర్డీఏ కార్యాలయంలో ప్రవేశ రుసుముల చెల్లింపుల అంశంపై అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వీఎమ్మార్డీఏ పరిధిలో ఉన్న అన్ని పార్కులు, మ్యూజియం, ఎయిర్ క్రాఫ్ట్, కురుసుర సబ్ మెరైన్‌లలో ఉన్న ప్రవేశ రుసుముల టిక్కెట్లు విధానంలో మార్పులు చేస్తూ కొత్త విధానానికి నాంది పలికినట్లు తెలిపారు. ప్రవేశ టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా, యుపీఐ ద్వారా లేక డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రవీంద్ర, సెక్రటరీ రంగయ్య, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, బ్యాంక్ ఏరియా హెడ్ కె.కామేష్ పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలో మద్ది గ్రామపంచాయతీలో తునిపాలెం గ్రామంలో మంచినీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేస్తున్న పైపులైన్ పనులను స్థానిక ఎంపీపీ కె.రాం బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా సుమారు 8 లక్షల 20 వేల రూపాయలు మంజూరు కావడంతో ఈ పైప్ లైన్ పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ యూత్ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, గ్రామ వార్డు సభ్యులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొన్న కళాశాలలో ఇంజనీర్స్ డే

విశాలాంధ్ర - పరవాడ: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెం గొన్న ఇంజ నీరింగ్ కళాశాలలో జాతీయ ఇంజనీర్స్ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలతో నివాళులర్పించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను కళాశాల సెక్రటరీ గొన్న హేమ్‌చంద్ నాయుడు కొనియాడారు. అనంతరం విద్యార్థులకు ఎలోక్యూషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ఎస్సే రైటింగ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, మోడల్ ఎక్స్‌పో వంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ పిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

సీఎస్ఐ ఆధ్వర్యంలో గీతం ఐఓటీ వర్క్‌షాప్

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు సభ్యులుగా గల కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి)పై ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఎల్ అండ్ టి ల్యాబ్స్ వ్యవస్థాపకుడు కె.ప్రమోద్‌కుమార్ హాజరై విద్యార్థులకు ఐఓటి మెలకువలను తెలియజేసారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌లు డాక్టర్ జి.శ్రీనివాస్, ఎస్.మోహనకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై వర్క్‌షాప్

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని బీరం గ్రామ సచివాలయం పరిధిలో సచివాలయ, ఆరోగ్య సిబ్బందితోపాటు వలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వర్క్‌షాప్ నిర్వహించారు. పూర్తి సమాచారం సేకరించి మెడికల్ క్యాంపు జరిగే రోజుకు అందరూ మెడికల్ క్యాంపునకు హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు సచివాలయం స్టాఫ్, తల్లులు, పిల్లలు, హాజరై గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, మండల విద్యాశాఖధికారి, గ్రామ సర్పంచ్, వైస్ ఎంపీపీ, వైఎస్ఆర్ పార్టీ నాయకులు హాజరయ్యారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో నక్కపల్లి హెటిరో పరిశ్రమల చైర్మన్ బండి పార్థసారది రెడ్డి ఆదేశాల మేరకు రాజయ్యపేట గ్రామంలో 2 కిలోమీటర్ల మేర సిమ్మెంటు రోడ్డుకు సంబంధించి 70 లక్షల రూపాయలు సొంత నిధులతో నిర్మించబోయే రోడ్డు పనులకు హెటిరో ప్రతినిధులు యస్.కుల్లారెడ్డి, యం.సుబ్బారెడ్డి, రాజారెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా హెటిరో ప్రతినిధులు మాట్లాడుతూ హెటిరో యాజమాన్యం నక్కపల్లి ప్రాంతంలో గ్రామీణాభివృద్ధి సహకరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాసులమ్మ, ఎంపీటీసీ సత్యారావు, కోదండరావు, పి.రాంబాబు, తాతీలు, నగేష్, కాశీ, హెటిరో ప్రతినిధి సిహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ ఆర్మ్ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - అరకులోయ: తమిళనాడులోని నమ్మాక్కల్ జిల్లాలో ఈనెల 19వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరగనున్న ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ ఆర్మ్ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని కిల్లో సురేంద్ర, పి.అప్పలనర్స, పి.బాలదేవ్, ఎస్.ధర్మన్నపడాల్, కె.సత్యనారాయణ, కె.నర్సయ్య, పి.కుమారి, జి.చిన్నబాబు, టి.కౌసల్య తెలిపారు. మహాసభలకు దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల నుండి 500 మంది ఆదివాసీ మేధావులు, విద్యావేత్తలు ఉద్యమ ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. ఈ సమావేశానికి ఆంధ్ర రాష్ట్రం నుండి 34 మంది ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి తాము హాజరవు తున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు కాని ఆదివాసీ హక్కులు, చట్టాలపై చర్చించడం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా 700 పైగా 10 కోట్ల మంది ఆదివాసీలపై మూడు రోజులు పాటు పలు అంశాలపై చర్చిస్తామని తెలిపారు. మణిపూర్ ఆదివాసీలపై జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా మూడురోజులు పాటు జరిగే మహాసభల్లో చర్చించి రాబోయే మూడేళ్ల కాలంలో ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు.

నిజాయితీకి మారుపేరు చంద్రబాబు

విశాలాంధ్ర - యస్.రాయవరం: నిజాయితీకి మారుపేరు నారా చంద్రబాబు నాయుడు అని అనకాపల్లి జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలో పెదగుమ్ములూరు గ్రామంలో బాబు తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉన్న సమయంలో అభివృద్ధి సంక్షేమంతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పని చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై.వినోద్ రాజు, టీడీపీ మండలాధ్యక్షులు అమలకంటి అబద్ధం, పెద్దిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ సీనియర్ నాయకులు ఎన్.వెంకటరాజు, కురందాసు నూకరాజు, గుర్రం రామకృష్ణ, పల్లెల బుజ్జి, అల్లు నరసింహమూర్తి, ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాస్, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మండల అధ్యక్షుడుగా చిక్కాల రామారావు

విశాలాంధ్ర - పాయకరావుపేట: వైసీపీ పాయకరావుపేట మండల అధ్యక్షుడుగా మండలంలోని పెంటకోట గ్రామానికి చెందిన చిక్కాల రామారావు నియమితులయ్యారు. ఇప్పటివరకు పాయకరావుపేట పట్టణానికి చెందిన ధనిశెట్టి బాబూరావు పార్టీ మండల అధ్యక్షుడుగా పనిచేశారు. ఆయన స్థానంలో పార్టీ మండల అధ్యక్షుడుగా చిక్కాల రామారావును నియమిస్తూ వైసీపీ కేంద్ర కార్యాలయం నుండి జాబితా విడుదల చేశారు. చిక్కాల రామారావు ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా ఉన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని గ్రామాల్లో పట్టు ఉన్న బలమైన నాయకులుగా గుర్తించి చిక్కాల రామారావును పార్టీ అధిష్టానం మండల అధ్యక్షుడుగా నియమించారు. చిక్కాల రామారావు నియామకం పట్ల మండంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

విశాలాంధ్ర - పెదబయలు: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శుక్రవారం మండలంలోని అరడకోట గ్రామ సచివాలయం అరడకోట ఉప ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యేక యాప్‌లో అనారోగ్యంగా ఉన్న వారి వివరాలు అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే కూడా వైద్య సిబ్బంది చేత బిపి, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నిఖిల్, జెడ్పీటీసీ బొంజుబాబు, సర్పంచ్ మధ్య లింగం, వైస్ ఎంపీపీ రాజబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు వంతల ఆనందరావు, సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య, కనకరాజు, అనంతరావు పాల్గొన్నారు.

వైసీపీ భూకబ్జాదారులను అరెస్టు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - భీమిలి: విశాఖ పరిసర ప్రాంతాల్లో వైసీపీ నేతలే పెద్ద ఎత్తున భూ దందాలకు పాల్పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఆరోపించారు. ప్రతిపక్షం నేత చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ శుక్రవారం భీమిలిలో టీడీపీ చేస్తున్న దీక్షలో పాల్గొని సీపీఐ తరుపున సంఘీభావం తెలిపి మాట్లాడారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు నిర్వహించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుని అవినీతి చేశారంటూ అరెస్టు చేసే పద్ధతిని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి 60 నకిలీ కంపెనీలు పెట్టి వాటి ద్వారా సాక్షి, భారత్ సిమెంట్ కంపెనీలలో అక్రమంగా పెట్టుబడులు పెట్టించుకున్న దొంగ అని అన్నారు. పెద్ద అవినీతి పరుడైన ధర్మాన ప్రసాదరావుని రెవిన్యూ మంత్రిని చేసారని, ఆ అధర్మాన విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం ప్రభుత్వ భూమిని 4.89 ఎకరాలు కబ్జా చేస్తే ఆ భూమికి విశాఖ నగరకు పాలక సంస్థ 16 లక్షల రూపాయల వ్యయంతో రహదారి నిర్మాణం చేస్తున్నదని విమర్శించారు. ప్రజల ఆస్తులు కాపాడాలన్న చిత్తశుద్ధి ఉంటే ధర్మానను అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని అన్నారు. ఆనందపురం మండలం తర్లువాడ సర్వే నెంబరు 1లోని 120 ఎకరాలను రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి కుమార్తె విద్యాసంస్థ ఏర్పాటు కోసం ప్రభుత్వ నుంచి అతి తక్కువ ధరకు కొట్టేసి, కొండ భూమిని కొనేస్తున్నారని, విజయసాయి రెడ్డిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలని అన్నారు. ప్రజాసంఘాల నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి భయభ్రాంతులు చెయ్యడం సరికాదన్నారు. దీనిని వెనుక నుండి నడిపిస్తున్నది కేంద్రంలోని బీజేపీ పార్టీ అని టీడీపీ గుర్తించాలని తెలిపారు. సీపీఐ తరుపున సంఘీభావం తెలిపిన వారిలో మధురవాడ, భీమిలి పార్టీ కార్యదర్శులు వి.సత్యనారాయణ, కె.రాంబాబు, ఎండి బేగం, కె.మేఘూరావు, జి.వేళంగినిరావు, ఎం.ఎస్.పాత్రుడు, చిరంజీవి నారాయణరావు తదితరులు ఉన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయాలని హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ బి.ఎం.దివాన్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విశాఖ జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణ ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయుటకు అవసరమైన సిమెంటు, ఇసుక, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచాలని, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, వి.ఎం.ఆర్.డి.ఏ ఎస్ఈ భవాని ప్రసాద్, ఈపీడీసీఎల్ ఎస్ఈ ఎల్.మహేందర్ నాథ్ పాల్గొన్నారు.

ఉక్కు రక్షణకై యాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు రక్షణకై ఉత్తరాంధ్ర బైక్ యాత్రను జయప్రదం చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ స్టోర్ జంక్షన్ వద్ద బైక్ యాత్ర గోడపత్రులను స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం 100% వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి మద్దతుగా ఈ పోరాటాన్ని ప్రజా పోరాటంగా నిర్మించాలన్న ఆశయంతో ఉత్తరాంధ్ర జిల్లాలలో ప్రజలను చైతన్య పరచడం కోసం సీపీఎం ఆధ్వర్యంలో నగరంలోని జివిఎంసి వద్ద జరుగుతున్న దీక్షా శిబిరం నుంచి ఈనెల 20వ తేదీన బయలుదేరి 1050 కిలోమీటర్లు ప్రయాణించి ఈనెల 29వ తేదీన స్టీల్ ప్లాంట్ వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద ముగుస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్టీల్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు, స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి దాస్, యు రామస్వామి, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు జె.రామకృష్ణ, రమణమూర్తి, గణపతి రెడ్డి, డివి రమణారెడ్డి, డి.సురేష్ బాబు, సిహెచ్ సన్యాసిరావు, వరసాల శ్రీనివాస్, కరణం సత్యారావు, నమ్మి సింహాద్రి, తాడికొండ జగదీష్, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎస్టీ ధ్రువపత్రాలు జారీ చేసిన అధికారులను అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర - హుకుంపేట: నకిలీ ఎస్టీ ధ్రువపత్రాలు జారీ చేసిన అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పల నర్స డిమాండ్ చేశారు. పాడేరు ఐటీడీఏ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహాధర్నా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.సుందర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీ తెగల పేర్లతో రెవెన్యూ అధికారులు విచ్చలవిడిగా నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే అరకు, పాడేరు, చింతపల్లి ప్రాంతంలో నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారు ఉద్యోగం, విద్య రంగంలో ఆదివాసీల హక్కులు, రాయితీలు, ప్రోత్సాహకాలు మొదలగు ఆదివాసీల ప్రయోజనాలు పొందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధకృష్ణ, జె.వి.వి జిల్లా కార్యదర్శి జె.ఆనంద్ రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి చిన్నారావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు టి.కృష్ణారావు, మహిళ సంఘం జిల్లా కార్యదర్శి బిమాలమ్మ, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పల కొండ పడాల్, ఏఐటీయూసీ నాయకులు అమర్ పాల్గొన్నారు.

పెదబయలు: ఆదివాసీలు తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని పోరాటం చేస్తుంటే అక్రమ అరెస్టులు చేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఆదివాసులు తరతరాలుగా సాగు చేస్తున్న సాగు భూములకు పోడు పట్టాలు మంజూరు చేయాలని అన్నమయ్య జిల్లా రాయచోటిలో గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్ నాయక్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తుంటే, ఆదివాసులకు పట్టాలివ్వకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. అరెస్ట్ చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి సెగ్గె లక్ష్మణరావు, గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు డి.విమలమ్మ, విమల, ముప్పల లక్ష్మణరావు, కె.చంటిబాబు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు అమర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై తెలుగు మహిళలు నిరసన

విశాలాంధ్ర - వి.మాడుగుల: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా శుక్రవారం మాడుగులలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిజి.కుమార్, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, చీడికాడ మాజీ జెడ్పీటీసీ వి.సత్యవతి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ముందుగా బస్టాండ్ వద్ద ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షులు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే బుద్ధ నాగజగదీశ్వరరావు హాజరై మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు చేయడం ద్వారా టీడీపీ శ్రేణులను మానసికంగా దెబ్బతీసి లబ్ధిపొందాలన్న సీఎం జగన్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు అద్దేపల్లి జగ్గారావు, పుప్పాల అప్పలరాజు, ఉం డూరు దేముడ, వద్దాది రంజిత్‌వర్మ, నందారపు సన్యాసిరావు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

బాబుతో మేము సైతం

విశాలాంధ్ర - మల్కాపురం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బాబుతో మేము సైతం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టీడీపీ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ, విజయనగరం జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాల నాయుడు, ఎంపీ ఎంవీవీ, కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్ తదితరులు సీఎంకు స్వాగతం పలికారు.

నేడు పోతిన సన్యాసిరావు వర్ధంతి

విశాలాంధ్ర - మల్కాపురం: కామ్రేడ్ పోతిన సన్యాసిరావు వర్ధంతిని ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్టు సీపీఐ నాయకులు తెలిపారు. 16వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు మల్కాపురం గ్రామ మండలిలో జరిగే ఈ కార్యక్రమానికి సీపీఐ పార్టీ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జీవీఎంసీలో ఇంజనీర్స్ డే

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అభివృద్ధికి పునాదులు ఇంజనీర్లే అని నగర మేయర్ గొలగని హరి వెంకట కుమారి అన్నారు. శుక్రవారం ఆమె ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీరింగ్ పితామహుడు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జీవీఎంసీలో పలువురు ఇంజనీరింగ్ అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ భారత సాంకేతిక రంగానికి, క్రమ శిక్షణకు, పట్టుదలకు జీవనసాక్షిగా ఎన్నో ప్రాజెక్టుల రూపశిల్పి సుప్రసిద్ధ ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య మనకు ఆదర్శప్రాయుడన్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ రవి కృష్ణ రాజు మాట్లాడుతూ అనేక వత్తులతో ఇంజనీర్లు పట్టణీకరణ సుందరీకరణ కోసం మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. పర్యవేక్షక ఇంజనీర్ల నుండి సహాయక ఇంజనీర్ల వరకు మేయర్ వారిని సన్మానించారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర - ఆనందపురం: వినాయక చవితి వేడుకలు సందర్భంగా నియమ నిబంధనలు పాటించాలని ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. ముఖ్యంగా అనుమతి పొందేందుకు దరఖాస్తుతో పాటు ఫైర్, ఎలక్ట్రికల్, డిపార్ట్మెంట్లో అనుమతులు జత చేసి ఎన్ని రోజులు విగ్రహాన్ని ఉంచుతారో, విగ్రహం ఎత్తు క్లుప్తంగా తెలియపరచాలని, అలాగే ప్రతి మండపానికి పోలీసు నిఘా ఉంటుందని అన్నారు. ట్రాఫిక్ వారికి ఇబ్బందులు లేకుండా మందుబాబులు నిమజ్జనానికి దూరంగా ఉండాలని నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలని అన్నారు.

విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: మండలంలోని గత్తెర జిల్లేడ గ్రామంలోని శుక్రవారం ఆఫ్టర్ స్కూల్ క్లబ్ విద్యార్థులకు ఆట వస్తువులతో పాటు విద్య సామగ్రిలను శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్ఛార్జి మొస్య సుజాత సల్మాన్ పంపిణీ చేశారు. అనంతరం సుజాత సల్మాన్ మాట్లాడుతూ సేవా భారత్ ఆర్థిక సాయం ద్వారా ఆట వస్తువులు, తన సొంత నిధుల ద్వారా విద్యా సామాగ్రిలను అందిపుచ్చుకున్న గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఆఫ్ క్రిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తెలగంజి సాల్మన్, ఏజెన్సీ ప్రా సేవభరత్ రాష్ట్ర నాయకులు శివారెడ్డి వెంకటేశ్వరులు, సుధీర్, నానాజీ, ఏఎస్‌సీ క్లబ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసులకు గ్రీవెన్స్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు రాష్ట్ర డి.జి.పి కె.వి.రాజేంద్రనాథరెడ్డి ఆదేశాల ప్రకారం జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ కార్యాలయంలో జిల్లా పోలీసు సిబ్బందికి గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ముగ్గురు పోలీసు సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయం నందు హాజరై, వారి అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు.

మృతి చెందిన పి.ఎస్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

జిల్లాలోని నాతవరం పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కె.అప్పారావు కుటుంబానికి పోలీస్ సిబ్బంది ఆర్థిక సహాయం అందజేశారు. 1990 సం. బ్యాచ్ మేట్స్ అనిల్, సుబ్బరాజు, నాయుడు, రమేష్, సింహాచలం, బాబురావు, రఘు, బీశెట్టి వెంకటేశ్వరరావు, మిలిటరీ నాయుడుల ద్వారా సేకరించిన నగదును మధురవాడలోని అప్పారావు స్వగృహానికి హెడ్ కానిస్టేబుల్స్ వెంకటేశ్వరరావు, పూర్ణచంద్రలు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.60 వేల రూపాయల నగదును ఆర్థికంగా అందజేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో రాజవొమ్మంగి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ మంజూరు చేసిన రూ.13.39 లక్షల విలువైన వాహనాన్ని మత్స్యకారుడు ముమ్మన ఆదినారాయణకు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద లబ్ధిదారునికి అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5.31 లక్షల రాయితీని ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. మిగిలిన రుణాన్ని సకాలంలో బ్యాంకుకు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ వి.అభిషేక్, డీఆర్ఓ వి.అంబేడ్కర్, ఎల్‌డీఎం రవితేజ, జిల్లా ఫిషరీస్ అధికారి శ్రీనివాసరావు, ఎఫ్‌డీఓ సిహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్త కోట గ్రామానికి చెందిన విస్సారపు రాజు బుధవారం రావికమతం నుండి స్వగ్రామం కొత్త కోట ఆటో లో వస్తుండగా మార్గమధ్యంలో భూమి డాక్యుమెంట్స్ పోయినవి దొండపూడి గ్రామ సర్వే నెంబర్ 42/15బి0-13సెంట్లు మెట్టు భూమి 42/16-0-12 సెంట్లు, 42/17లో 0/2సెంట్లు 42/20లో 0-30 సెంట్లు భూమి తాలూకా డాక్యుమెంట్స్ పోయినవి ఇవి దొరికిన వారు ఈక్రింది చిరునామా వారికి గాని లేదా ఫోన్ నెంబరుకు తెలియజేయగలరని మనవి.

చిరునామా
విస్సారపు రాజు, కొత్తకోట రావికమతం మండలం, ఫోన్ నెంబరు 9390800976

విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

ఘనంగా పోషకాహార మహోత్సవములు

విశాలాంధ్ర – అడ్డతీగల: అడ్డతీగల మండల పరిధిలో తుంగమడుగుల గ్రామంలో పోషక ఆహార మహోత్సవములు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులకు, బాలింతలకు, స్థానికులకు పోషక ఆహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ దీప్తి మాట్లాడుతూ జన్మించిన బిడ్డ రెండు సంవత్సరములు వచ్చేవరకు తీసుకోవలసిన పోషకాహారంపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, సూపర్వైజర్ పావని పాల్గొన్నారు.

నిఖాకు లక్ష రూపాయల విరాళం

విశాలాంధ్ర – చింతూరు: పేద ముస్లిం వధువు నిఖా (పెళ్లి)కి చత్తీస్గఢ్ రాష్ట్రంలోని కుంట గ్రామానికి చెందిన ఒక ముస్లిం కుటుంబానికి పెళ్లి ఖర్చుల నిమిత్తం శుక్రవారం లక్ష రూపాయల చెక్కును డాక్టర్ జమాల్ ఖాన్ అందజేశారు. శుక్రవారం నిమ్మలగూడెంలోని అఫ్రీన్ ఆయుర్వేద వైద్యులు జామల్ ఖాన్ మాట్లాడుతూ పేదల పట్ల అందరూ దయ కలిగి ఉండాలని వాళ్ళ అవసరాలను గుర్తించి వీలైనంత ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ ఎండి ఇమ్రాన్ ఖాన్, బోర్డు డైరెక్టర్స్ సయ్యద్ సుభాని, ఎండి జావిద్, నాదర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఎంపీ మాధవి ఘన స్వాగతం

విశాలాంధ్ర – కొయ్యూరు : విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ఘన స్వాగతం పలికారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో గల సమస్యలు వివిధ అభివృద్ధి పనుల మంజూరు విషయమై ప్రస్తావించగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ మాధవి తెలిపారు.

80 మందికి వైద్య సేవలు

విశాలాంధ్ర. – దేవీపట్నం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రి వారి ఆధ్వర్యంలో శుక్రవారం దేవీ పట్నం మండలం పోతవరం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో లో సుమారు 80మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ సంస్థ కార్యదర్శి స్వామీ పరిజ్ఞానాంద జి.మహారాజ్ తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్. దాసరి ఉమా మహేష్ వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో రామకృష్ణ మిషన్ ఆఫీస్ ఇంచార్జీ స్వామీ వేద విద్యానంద జీ మహారాజ్, రామకృష్ణ మఠం మేనేజర్ స్వామీ, రఘువీరా నంద, మహారాజ్ వివేకానంద ఇన్సుట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సెన్స్ ఇంచార్జీ స్వామీ సేవ్యా, కానుమొను శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంజనీర్స్‌డే వేడుకలు

విశాలాంధ్ర – మాకవరపాలెం: స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజనీర్స్‌డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నం ఎన్ఎస్‌టిఎల్ వర్షిప్ టెక్నాలజీ డైరెక్టర్ కెప్టెన్ ఎవిఎస్ఎన్.మూర్తి, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఇంజనీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ శాఖకు చెందిన జనరల్ మేనేజర్ ఎంవిఎస్.దుర్గాప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ ఏవిఎస్ఎన్.మూర్తి, ఎంవిఎస్.దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.ప్రసాదరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ టి.శ్రీనివాసరావు, డాక్టర్ ఈ.గోవింద పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కోరుతూ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర – మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు పై శుక్రవారం నిరసన తెలియజేస్తూ బాబు క్షేమం కోరి అమ్మలగన్న అమ్మ ఆదిపరాశక్తి దుర్గమ్మ వారికి 61 వార్డ్ టిడిపి మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు పేరుమీద పూజలు చేయించారు.

ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు

విశాలాంధ్ర – పెందుర్తి: తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు లభించింది. అనకాపల్లి జిల్లా, సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీలో ఈ గుర్తింపు సర్టిఫికెట్ ను జాతీయ జి.ఐ.సంస్థ అందించింది. ఈ సందర్భంగా ఐపిఆర్ ప్రెసిడెంట్ సంజయ్ గాంధి, వైస్ చాన్సలర్ సుధ, ఆత్రేయపురం పూతరేకుల తయారీదారుల సంఘం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఒక ఆహారపు ఉత్పత్తి సంస్థకు జి.ఐ. గుర్తింపు ఇచ్చి ప్రోత్సహించడం వారిపై మరింత బాధ్యత పెరిగినట్లుగా భావించాలన్నారు. ఆత్రేయపురం పూతరేకుకు 400 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. అనంతరం మాడుగుల హల్వాకు జాతీయ జి.ఐ. గుర్తింపుకోసం ఎమ్.ఓ.యు. కుదుర్చుకున్నారు.

చిననాగమయ్యపాలెంలో గడప-గడపకూ

విశాలాంధ్ర – భీమిలి: మండలంలోని చిననాగమయ్యపాలెంలో గడప-గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే 539 గడపలను సందర్శించి ప్రభుత్వ పథకాలను ఆవిష్కరించారు. పర్యటనకు విచ్చేసిన అవంతికి బొడ్డు దుర్గారావు ఆధ్వర్యంలో అడుగడునా పూల వర్షంతో జై జగన్ జై అవంతి అని హోరెత్తించారు. డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేపట్టాలని, సి సి రోడ్లు నిర్మాణం చేపట్టాలని, త్రాగునీటి సౌకర్యార్థం ఇంటింటి కొళాయిలు వేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో భీమిలి మండలం వైసిపి పార్టీ శ్రేణులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

సందడిగా టీఎస్సార్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శాశ్వత ఆహ్వానితులు డా . టి.సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలు సిరిపురం సమీపంలోని తన నివాసంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషుల మధ్య సందడిగా జరుపుకున్నారు. అభిమానుల మధ్య టీఎస్సార్. కేక్ కట్ చేశారు. సుదీర్ఘకాలం పాటు కేంద్రమంత్రిగా, ఎంపీగా విశాఖ ప్రజలకు తాను నిస్వార్థ సేవలందించానని, ఈ నేపథ్యంలో మళ్లీ తనను విశాఖ లోక్ సభ అభ్యర్థిగా పోటీ చేయాలని ప్రజలు కోరుతున్నట్టు తెలిపారు. ఈ విషయంపై ఆలోచించి నిర్ణయాన్ని ప్రకటిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు గొంప గోవింద్,యల్లపు రఘురామ్, పేడాడ రమణ కుమారి, టీఎస్సార్ కార్యదర్శి ఎస్.కే.భాషా, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యలింగేశ్వరుడ్ని దర్శించుకున్న జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్

విశాలాంధ్ర – హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మత్స్య గుండం లోని శ్రీ మత్స్య లింగేశ్వర స్వామి వారిని శుక్రవారం దేవధాయ ధర్మ ధాయ శాఖ జిల్లా సహా కమిషనర్ ఎస్. చంద్ర శేఖర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నిత్యం దీప, దూప నైవేధ్యాలను సక్రమంగా నిర్వహించాలని ఆయన అర్చకునికి సూచనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువా తో సన్మానించి ఆలయ చరిత్ర పుస్తకం ను అందజేశారు. ఈ కార్యక్రమం లో దేవ ధాయ శాఖ జూనియర్ అసిస్టెం ట్ చంద్ర తేజ, అర్చక సమాఖ్య అల్లూరి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ పరమ హంస, ఆలయ కమిటీ పెద్దలు టీ అప్పారావు, ఏం సూర్య నారాయణ నాయుడు, సభ్యులు సింహాచలం నాయుడు, మత్స్య కొండబాబు, ఏం రాంబాబు, ఏ బాలయ్య, సిహెచ్ హరి నాథ్, కె రాంబాబు,ఏం మోహన్ పాల్గొన్నారు.

అర్జ్గోస్టర్.కామ్ ఆవిష్కరణ

విశాలాంధ్ర – విశాఖపట్నం: రిట్మెల్ టెక్ ఫ్లాట్‌ఫారమ్ అర్జ్గోస్టర్.కామ్‌ను ప్రారంభించినట్లు అర్జ్గా వ్యవస్థాపకుడు, సీఈవో ఖుష్నుద్ ఖాన్ తెలిపారు. గృహోపకరణాలు, ఇది ఈ కామర్స్‌ను మరింత కస్టమర్ ఫ్రెండ్లీగా చేస్తుందన్నారు. పండుగల సీజన్ సమీపిస్తున్నందున, భారతీయ దుకాణదారులు, ఆఫ్లైన్ ట్రైలర్‌ల మధ్య మంచి సంబంధాన్ని ఏర్పరచుకోవడానికి ఇది సహాయపడుతుందన్నారు. గోస్టర్.కామ్ గృహోపకరణాల కొనుగోలు కోసం రూపొందించబడిన ఫ్లాట్‌ఫారమ్‌లో ప్రత్యేకమైన ఇన్-స్టోర్ అనుభవాన్ని పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ ఫ్లాట్‌ఫారమ్ వినియోగదారులకు నిపుణుల సహాయాన్ని పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. గోస్టర్.కామ్ ఫ్లాట్‌ఫార మ్‌లో కొనుగోలు చేసిన ప్రతిగృహోపకరణానికి జీవితకాల సంరక్షణ ఉంటుందన్నారు. కొనుగోలులో భాగంగా ఇంటిగ్రేటెడ్ ప్రొడక్ట్ ఇన్‌స్టాలేషన్‌తో పాటు, ప్రొడక్ట్ లైఫ్-సైకిల్ కేర్ సొల్యూషన్‌గా, డోర్‌స్టెప్ సర్వీస్ కోసం ఏదైనా అప్లయెన్సెస్ బ్రేక్‌డౌన్ అయినప్పుడు కస్టమర్‌లు తక్షణ సర్వీస్‌రిక్వెస్ట్‌ను కూడా అందజేసేందుకు వీలుకల్పిస్తుందని తెలిపారు.

మార్కెట్లో తూనికలు అధికారులు ఉక్కు పాదం

విశాలాంధ్ర – ఆనందపురం: విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురించిన కథనానికి స్పందించిన తూనికల అధికారులు శుక్రవారం మండలంలో ఉత్తరాంధ్రకే పూలు మార్కెట్‌గా పేరున్న వేములవలస మహాత్మా గాంధీ తూనికలు ,కొలతల శాఖ అధికారులు మనోహర్ ఆదేశాలు మేరకు మార్కెట్లో ముమ్మరంగా తనిఖీలు చేశారు. మార్కెట్లో వినియోగిస్తున్న తూనికలు రైతులు జరుగుతున్న మోసాలను గుర్తించి నాలుగు కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్.వి రమణమూర్తి, చిన్నమ్మ ,ఉమా సుందరి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌తో 'థమ్స్ అప్ ఫ్యాన్ పల్స్

విశాలాంధ్ర– విశాఖ సిటీ: కోకా-కోలా కంపెనీ నుండి భారతదేశపు స్వదేశీ పానీయాల బ్రాండ్, డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌తో కలిసి వినూత్నమైన మరియు లీనమయ్యే క్రికెట్ అనుభవాన్ని అందించే 'థమ్స్ అప్ ఫ్యాన్ పల్స్'ని ప్రారంభించడం పట్ల చాలా ఉత్సాహంగా ఉంది. థమ్స్ అప్ ఫ్యాన్ పల్స్ క్రికెట్ పట్ల గల నిబద్ధత యొక్క కొత్త శకాన్ని పరిచయం చేస్తుంది, సౌరవ్ గంగూలీ, యువరాజ్ సింగ్, గౌతమ్ గంభీర్, వీరేంద్ర సెహ్వాగ్, దినేష్ కార్తీక్‌లతో సహా అగ్రశ్రేణి నిపుణులతో కూడిన ఈ సిరీస్, "వాయిస్ ఆఫ్ క్రికెట్" - హర్ష భోగ్లే ద్వారా హోస్ట్ చేయబడింది.

ఆర్‌వి పురంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర – పద్మనాభం: మండలంలోని ఆర్‌వి పురంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి 243 ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమం శుక్రవారం పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ఎస్ ఓ ఎస్ ఆర్గనైజర్ మేనేజర్ దుర్గరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. విశాఖపట్నం కు చెందిన మెడికవర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో తరుణ్, దినేష్ వైద్య ఇతర సిబ్బంది పాల్గొని ఈసీజీ రక్త పరీక్షలుచేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ సిబ్బంది శ్యామల, ఆదిలక్ష్మి, జానకి తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర – గొలుగొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కులమతాలకు అతీతంగా అర్హులైన అందరికీ వైయస్సార్ పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని గొలుగొండ జడ్పిటిసి వెంకటగిరి బాబు అన్నారు. శుక్రవారం చీడిగుమ్మల గ్రామంలో కొత్తగా మంజూరైన 36 పెన్షన్లను లబ్ధిదారులకు అందించారు.

ఎందుకీ రహదారి....?

విశాలాంధ్ర – జి.మాడుగుల: అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం పాలమామిడి పంచాయతీ దరి గల కొక్కిరాపల్లి ప్రధాన రహదారి నుండి లకుశ్శు, బొడ్డగుంది గ్రామం వరకు నిర్మించిన రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. మూడు కిలోమీటర్ల మేర పి ఐ యు నిధులతో సుమారు రెండు కోట్ల రూపాయలు వెచ్చించి మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టగా మొత్తం మూడు కిలోమీటర్ల ధ్వంసం కావడం నాణ్యతలోని డొల్లతనాన్ని బయటపెడుతుంది.

చంద్రబాబు వెంటే ముస్లింలు..

చంద్రబాబు విడుదల కావాలని ప్రత్యేక ప్రార్థనలు...

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: చంద్రబాబుకు అరెస్ట్ నుంచి విముక్తి కలగాలని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో ముస్లిం మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో నమాజ్ కార్యక్రమం నిర్వహించారు.నమాజ్ లో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చంద్రబాబు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి చంద్రబాబు పై అక్రమ కేసులు పెట్టారని, చంద్రబాబు తొందరగా బయటకు రావాలని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్ మాట్లాడుతూ చంద్రబాబు ను అక్రమంగా , అన్యాయంగా అరెస్టు చేసి రిమెండ్‌కు పంపించారని, చంద్రబాబు క్షేమంగా బయటకు రావాలని ముస్లిం లకు అతి పవిత్రమైన రోజు అయిన శుక్రవారం రోజున రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి. టీడీపీ విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రఫీ తోపాటు అనేకమంది ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వైకాపా అక్రమ కేసులపై ప్రధానికి పోస్టు కార్డులు

విశాలాంధ్ర బ్యూరో – అనకాపల్లి: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పై వైకాపా ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులపై ప్రధానికి పోస్టు కార్డులు ద్వారా తెలియజేయాలని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. టీడీపీ జనసేన పొత్తుతో వైకాపా జగన్ రెడ్డి చిత్తు చిత్తు అవుతారని అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారని అన్నారు. తుమ్మపాల మేజర్ పంచాయతీలో జరిగిన మూడో రోజు రిలే నిరాహారదీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా బాబుతో నేను సైతం అంటూ సంతకాలు చేశారు. జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని మంచి వారు జైలుకి వెళ్తున్నారని , అవినీతిని ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబీ, మళ్ల సురేంద్ర, నడిపల్లి గణేష్, సేనపతి స్వరూపా, పచ్చికూర రాము, బి. యస్. మ్. కే. జోగీ నాయుడు, బొడ్డపూ ప్రసాద్, పోలారపూ త్రినాథ్, బత్తుల లక్ష్మీ, కరణం శ్రీనివాసరావు, జనసేన నాయ కులు దూలం గోపీ, గంగుపాం జగదీష్, మళ్ళ శ్రీను, పావాడ కామరాజు, పల్లెల గణేష్ పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

విశాలాంధ్ర – పాయకరావుపేట: అనకాపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని పెంటకోట గ్రామంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కరువు పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. ఈసందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజనులో జిల్లాలో 2.04 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు నమోదు కావాల్సి ఉండగా, కేవలం 1.13 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు నమోదు అయ్యాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు కారణంగా వరి ఆకుమడులు ఎండిపోయాయని తెలిపారు. జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, పంట రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కరువు పరిస్థితులపై జిల్లా కలెక్టర్, మంత్రులు దృష్టికి తీసుకెళ్తానని చిక్కాల రామారావు తెలిపారు. ఈకార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, ఆర్.దండుబాబు పాల్గొన్నారు.

జీవీఎంసీ యూత్ వర్సెస్ గార్బేజ్ అవగాహన సదస్సు

విశాలాంధ్ర – పెందుర్తి: స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో జీవీఎంసీ అధ్వర్యంలో యూత్ వర్సెస్ గార్బేజ్ అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఈ. ఫ్లోరా తెలియజేశారు. ఈ సదస్సులో ముఖ్య పర్యవేక్షకుడు రవికుమార్ మాట్లాడుతూ గార్బేజ్ చాలా ప్రమాదకరమైనదని, ప్రత్యక్షంగా, పరోక్షంగా మనం కూడా ఈ ప్రమాదానికి గురవుతున్నామని విద్యార్థులకు అనేక ఉదాహరణలతో అవగాహన కల్పించారు. జీవీఎంసీ బృందం నుంచి వచ్చిన రాజబాబు చక్కని ఇంద్రజాల ప్రదర్శన కనబరిచి కళాశాల విద్యార్థులకు ఎంతో ఉత్సాహ, ఉల్లాసాలను అందించారు. ఈ సదస్సులో ఆదర్శ డిగ్రీ కళాశాల సెక్రటరీ టీ తియోపిలస్, మున్సిపల్ ఆఫీసర్ డాక్టర్ జె కృష్ణంరాజు, శానిటరీ సూపర్వైజర్ కె.వి రమణ, 96 వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ గౌరీ నాయుడు, ఆదర్శ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవిబాబు పాల్గొన్నారు. మంజుల, గౌతమ్ బాబు, అచ్చమ్మ ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బాధ్యుల నియామకం

విశాలాంధ్ర బ్యూరో – అనకాపల్లి: వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం అనకాపల్లి జిల్లా పరిధి లోని అన్ని పట్టణ, మండలాల శాఖలకు అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులను శుక్రవారం విడుదల చేశారు.

అనకాపల్లి పట్టణ శాఖ అధ్య క్షులుగా మందపాటి జానకిరామరాజు, కశింకోట మండల శాఖ అధ్యక్షులుగా మలసాల కిశోర్, అనకాపల్లి మండల శాఖ అధ్యక్షులుగా పెద్దిశెట్టి గోవింద్‌లను నియమించారు. వీరితో పాటు అనకాపల్లి జిల్లా పరిధిలోని అన్ని మండల, పట్టణాల శాఖల అధ్యక్షులను కూడా కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

స్పందనకు పోటెత్తిన అర్జీదారులు

విశాలాంధ్ర – కోటవురట్ల: మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. వారందరి సమస్యలు కలెక్టర్ రవి పటాన్ శెట్టి ఓపిగ్గా విని సమస్య పరిష్కారానికి ఆయా శాఖ అధికారుల సమక్షంలో సమాధానాలను రాబట్టారు. కోదండరాంపురం గిరిజనులకు రోడ్డు నిర్మించాలని కలెక్టర్ కు విన్నవించారు. దివ్యాంగులకు రిజర్వేషన్ ప్రకారం బ్లాక్ లాగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని, మూడు వేలు ఇచ్చే పెన్షన్ 6000 కు పెంచాలని, మండల కేంద్రంలో దివ్యాంగుల సామాజిక భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా యదేచుగా జరుగుతుందని ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలో మండల స్థాయి అధికారులు పూర్తిగా విఫలం చెందారని తక్షణమే స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండల తెదేపా అధ్యక్షులు జానకి శ్రీను, పివి సూర్యారావు, సుంకర బాబ్జి కలెక్టర్, ఏ ఎస్ పి కి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఏఎస్పి అది రాజు సింగ్, డి ఆర్ డి ఎ పి డి లక్ష్మీపతి, డ్వామా పిడి సందీప్, నర్సీపట్నం ఆర్డీవో జయరాం, మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు అధిక సంఖ్యలో అర్జీదారులు పాల్గొన్నారు.

ఆరునెలల్లో ఏపీలో టీడీపీ, జనసేన ప్రభుత్వం

విశాలాంధ్ర – పెందుర్తి: ఆరునెలల్లో ఏపీలో టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పాటు కానుందని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత బండారు సత్యన్నారాయణమూర్తి తెలిపారు. చంద్రబాబు అరెస్ట్ ను నిరసిస్తూ పెందుర్తిలో టిడిపి, జనసేన శ్రేణులు ఆందోళన చేపట్టాయి. బాబుగారికి తోడుగా మేము సైతం నినాదంతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టగా స్థానికులనుండి మంచి స్పందన లభించింది. అలాగే పార్టీ కార్యాలయం నుండి కూడలి వరకు ర్యాలీ నిర్వహించి సైకో పోవాలి.. సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేసారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పీలా శ్రీనివాసరావు, రెడ్డి నారాయణరావు, కరకదేముడు, పీలా జితేంద్ర జనసేన నాయకులు పాల్గొన్నారు.

పెద్దబ్బాయి హఠాన్మరణం పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర – చింతపల్లి :- వైకాపా నాయకుడు బచ్చులి పెద్దబ్బాయి హఠాన్మరణం ఆ ప్రాంతంలో పార్టీకి తీరని వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు, పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు తమర్బ నర్సింగరావు, ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, సర్పంచ్ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత అన్నారు. వైకాపా నాయకునిగా బలపం పంచాయితీలో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించే పెద్దబ్బాయి ఇక లేరు అనే విషయం తమను ఎంతగానో కలచివేసిందన్నారు. ఆయన సోదరుడు బచ్చులి బాబురావు, ఎంపీటీసీ సభ్యురాలు మచ్చమ్మ దంపతులతో పాటు వైకాపా నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ చురుకుగా పాల్గొనే పెద్దబ్బాయి హఠాన్మరణం పార్టీకి తీరని లోటని అభిప్రాయం వ్యక్తం చేశారు. భగవంతుడు ఆ కుటుంబానికి మనో నిబ్బరాన్ని ప్రసాదించాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే

విశాలాంధ్ర – పాయకరావుపేట: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింది ఇంటింటి సర్వే చేస్తున్నట్లు ఎంపిడీఓ సాంబశివరావు తెలిపారు. పథకంలో భాగంగా వాలంటీర్ ఇంటింటికి వెళ్లి సురక్ష బ్రోచర్ అందించి కుటుంబంలో ఉన్న సభ్యులు ఆరోగ్య పరిస్థితులు, గతంలో ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకున్న వైద్యం తదితర వివరాలు సేకరిస్తారని తెలిపారు. అనంతరం ఎఎన్ఎం పరిశీలిస్తారని తెలిపారు. ఈనెల 30వ తేదీ నుండి వచ్చే నెల 27వ తేదీ వరకు గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జగతా శ్రీను, ధనిశెట్టి మహేష్, ఇన్‌ఛార్జి ఈఓపీఆర్డి వై.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో మరో కొత్త పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని జెసిఎస్ మండల ఇన్చార్జి ఆవుల మరియదాసు ఎంఎల్‌ఓ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వాలంటీర్లు ఏఎన్ఎంలు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ కరక లక్ష్మి, సచివాలయం కన్వీనర్లు కరక వెంకటేష్, వైతం శ్రీను వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర – రావికమతం: కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి వివిధ గ్రామాల్లో నిర్వహించినటువంటి వినాయక ఉత్సవాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులు తీసుకోవాలని కొత్తకోట ఎస్ఐ విభూషణ్‌రావు తెలిపారు. విద్యుత్‌కు సంబంధించి పంచాయతీ నుంచి, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ప్రతి కమిటీ కూడా ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధార్ కార్డులు, ఇతర ఐడి ప్రూఫ్‌లతో స్టేజ్, మైక్ పర్మిషన్లు పోలీస్ స్టేషన్ నుండి పొందాలన్నారు.

కొనసాగుతున్న నిరసనలు

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఎమ్మెల్యే గణబాబు ఇంటి వద్ద నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా 98వ వార్డ్ లో తెదేపా పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పాసర్ల ప్రసాద్, వార్డ్ కార్పొరేటర్ పివి ఎస్.ని కాలనీలో మహాత్మ గాంధీ విగ్రహానికి పూల దండలు వేసి నిరసన వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర బ్యూరో – పాడేరు: వట్టివేగిసే గ్రామం జయంతి సైసెస్, టెక్నో సర్వ్ సహకారంతో ఎం. నిట్టాపుట్టు గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో రైతులు, వ్యాధిగ్రస్తులకి హెల్త్ చెకప్‌తో పాటు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో జయంతి సైసెస్ అధికారులు, టెక్నో సర్వ్ సిబ్బంది ఎం. నిట్టాపుట్టు గిరిజన రైతు సంస్థ చైర్పర్సన్ విజయ, సి ఈ ఓ పరధాని గంగరాజు, టెక్నో సర్వ్ నుంచి దేవి దత్త సాహు, వాసు, చిన్నారావు కృష్ణమూర్తి, రామకృష్ణ, వెంకట్రావు పాల్గొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల



విశాలాంధ్ర – సీలేరు: డొంకరాయి జలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి 4300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. డొంకరాయి జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా రాత్రి 7 గంటల సమయంలో 1035.5 అడుగులకు నీటిమట్టం పెరిగింది. దీంతో ఏపి జెన్‌కో అధికార్లు నీటి నిల్వలు పెరగకుండా జలాశయంలోని రెండు గేట్లను రెండేసి అడుగుల చొప్పున ఎత్తి 4300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థిని

విశాలాంధ్ర – పాయకరావుపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన త్రోబాల్ పోటీల నందు స్థానిక శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థిని బంగారు రజని అండర్ - 19 బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఎంపికైన రజనిని విద్యాసంస్థల అధినేతలు సీహెచ్‌వికె నరసింహారావు, సీహెచ్ విజయ్ ప్రకాష్, ప్రిన్సిపాల్ భానుమూర్తి, కోచ్ బాలరాజు తదితరులు అభినందించారు.

దార్లపూడిలో ఆటల పోటీలు ఎంపిక

విశాలాంధ్ర – యస్.రాయవరం : దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటలపోటీల సెలక్షన్ జరిగాయి. గ్రామ సర్పంచ్ సుహాసిని, ప్రధానోపాధ్యాయులు రమణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రథమ సహాయకులు జాన్ మాస్టర్, ఉన్నత పాఠశాలల టీమ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, స్థానిక పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పి శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర – పెదబయలు: తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25000 నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు బొండా గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సన్నిబాబు మాట్లాడుతూ మండలంలో గల మారుమూల ప్రాంతమైన గోమంగి పోయి పెల్లి బొండపల్లి గ్రామాల్లో పర్యటనలో భాగంగా వరద కొట్టుకుపోయిన పంట పొలాలను సందర్శించడం జరిగిందని బోండా పల్లి, గ్రామంలో 12 మంది రైతులు పూర్తిగా నీటిమట్టమైన పంటపొలాలను సందర్శించడం జరిగిందని వీరికి ఎకరాకి 25 వేలు పరిహారం చెల్లించాలన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

పర్యావరణహితమైన మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించండి

జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : వినాయక చవితి పండగను పురస్కరించుకొని ప్రజలందరు పర్యావరణహితమైన మట్టివినాయక ప్రతిమలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున విజ్ఞప్తి చేసారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమల స్టాల్ ను (ఉచితంగా పంపిణీ) జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. జిల్లా కలెక్టరేట్ సిబ్బందికి మరియు ఇతరులకు మట్టి వినాయక ప్రతిమలను జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరు వినాయక చవితి పూజకు మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలన్నారు. ఇది పూర్తిగా పర్యావరణ హితమైనవని నిమజ్జనం గావించినపుడు నీరు కలుషితం కాదని, మట్టిలో కలిసిపోవడం జరుగు తుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మరియు ఇతర పదార్ధాలతో తయారు చేసిన విగ్రహాలలో కెమికల్ మిళితమై ఉంటాయని, కాబట్టి వాటిని నిమజ్జనం గావించినపుడు నీరు, మట్టి కలుషితమై జీవులకు హాని కలుగజేసాయన్నారు. 6వేల మట్టి వినాయక ప్రతిమలను పిసిబి వారు తయారుచేసి జిల్లాలో నాలుగు చోట్ల (1. ఎం .వి.పి. రైతు బజార్, 2.జిల్లా పరిషత్ జంక్షన్, 3. సెంట్రల్ పార్కు జి.వి.ఎం .సి కార్యాలయం దగ్గర 4. అక్కయ్యపాలెం రైతు బజారు) లో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ కొరకు అందుబాటులో ఉంచిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డి ఆర్.ఓ కె.మోహన్ కుమార్, పి.సి.బోర్డు ఇ ఇ నాగిరెడ్డి, సమాచార శాఖ జాయింట్ డైరక్టర్ వి.మణిరామ్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

గంటాను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్లు ఎక్కడెక్కడ ఉన్నాయో , ఎంతమంది స్టూడెంట్స్ ఇందులో ఉత్తీర్ణత పొంది ఎంతమందికి ఉపాధి కలిగిందని ఫిజికల్ గా విజిట్ చేసి వాటిని నిరూపించడానికి కార్యక్రమం చేపట్టగా పోలీసులు అప్పటికే గంటా ఇంటికి చేరుకున్న హౌస్ అరెస్టుకు పూనుకున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విజయనగరం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో విశాఖలో కూడా టిడిపి నేతల అరెస్టులు గత వారం రోజులుగా కొనసాగుతూనే ఉన్నాయి. నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గత వారం రోజులుగా తెలుగు దేశం పార్టీ శ్రేణులు వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు పై, రిమాండ్ తరలించడం నిరసిస్తూ గత వారం రోజులుగా ఆందోళన చేపడుతున్నామని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గంటా ఇంటి వద్ద కళ్ళకు గంతులు కటుకొని వినూత్న రీతిలో నిరసన తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆంధ్ర యూనివర్సిటీలో ఉన్న సైమన్ సెంటర్ ద్వారా అనేకమంది ఉపాధి లభించింది అద్భుతంగా ఉందని ఏయూ వైస్ ఛాన్సర్ రిపోర్టులోనే చెప్పారన్నారు. పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం సరైన సమయంలో సరైన నిర్ణయంగా భావిస్తున్నామన్నారు. ఈ నిర్ణయంతో జనసేన, టీడీపీ సంబరాలు చేసుకుంటున్నారని, దీంతో వైసీపీ రాదని విషయం ఖరార్ అయిందన్నారు. జనసేన, టీడీపీ కలిస్తే సౌండ్ లేకుండా రౌండ్ అయిపోతుందని వైసీపీకి తెలుసన్నారు. రేపు కాగడాల ప్రదర్శన సంయుక్తంగా చేయాలని అనుకుంటున్నట్లు చెప్పారు. రాజకీయ దురుద్దేశం రాజకీయ కక్షతోనే చంద్రబాబును జైల్లో పెట్టాలని తప్పుడు కేసు పెట్టారన్నారు. చంద్రబాబు అరెస్టు జగన్ స్వయంగా ఆయన మరణ శాసనాన్ని ఆయన రాసుకోవడమే అని వ్యాఖ్యలు చేశారు. మర్డర్లు, మానభంగాలు, కూనికోర్లు ఉన్న జైల్లో ఆయన్ని పెట్టడం దారుణమన్నారు. బీజేపీ హస్తం ఉందా? లేదా? అనేది కేవలం ఊహాగానాలు మాత్రమే దీనిపై ఇంతవరకు వాళ్ళు ఎవరు మాట్లాడలేదని, వాస్తవం ఉందా లేదని తెలియదన్నారు. చంద్రబాబు, పవన్తో వైసీపీలో వణుకుపుట్టిందని, అలయన్స్ బ్రేక్ చేయడానికి ప్రయత్నాలు చేశార న్నార న్నారు. వైసీపీ నేతలు ఇప్పుడు తూర్పు తిరిగి దండం పెట్టడం తప్పితే మరేం లేదని గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యలు చేశారు.

పర్యాటక కేంద్రాలలో మట్టి పాత్రల స్టాల్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : జిల్లా పర్యటనకు వచ్చిన కుమ్మరి/శాలివాహన కార్పోరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ను మర్యాదపూర్వకంగా కలిసి శాలివాహన కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమలుపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్య మంత్రి ఎంతో నమ్మకంతో తనకు కార్పోరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కుమ్మరి, శాలివాహన ప్రజల శ్రేయస్సుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. చేదోడు పథకం కుండలు తయారుచేసే వారికీ కూడా వర్తింప చేయాలని ముఖ్యమంత్రిని కోరామని, త్వరలోనే కుమ్మరి వృతివారికి కూడా చేదోడు పథకం కింద రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పర్యాటక రంగానికి మంచి భవిష్యత్తు ఉన్నందున మట్టి పాత్రలు తయారు చేసే వారికి, మట్టి పాత్రల స్టాల్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తామని చైర్మన్ కు కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లాలో నలుగురు సభ్యులతో కుమ్మరి, శాలి వాహన సంక్షేమ కమిటీ జిల్లాలో నలుగురు సభ్యులతో కుమ్మరి, శాలివాహన సంక్షేమ కమిటీ ఏర్పాటైనట్లు ఆ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మండేపూడి పురుషోత్తం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి/శాలివాహన సంక్షేమ కార్పోరేషన్ చైర్మన్ తో పాటు కుమ్మరి/శాలివాహన సంక్షేమ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకట రావు, బిసి సంక్షేమ శాఖాధికారి రాజేశ్వరి, శాలివాహన సంక్షేమ కార్పోరేషన్ జిల్లా సభ్యులు శ్రీకాకుళపు వరలక్ష్మి, శ్రీకాకుళపు అప్పారావు, మోదు పురుపు ఈశ్వర్ తేజ, రెల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్స్ డే వేడుకలను సంస్థ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, డైరెక్టర్లు డి.చంద్రం, బి.రమేష్ ప్రసాద్, ఎ.వి.వి.సూర్యప్రతాప్, సీజీఎంలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా సమర్థవంతమైన సేవలందించాలంటే ప్రతి ఒక్కరు మంచి నడవడిక, నిబద్ధత, ఏకాగ్రత పాటించా లన్నారు. విశ్వేశ్వరయ్య పాటించిన నియమాలు, సమాజానికి ఆయన చేసిన సేవల వల్లే నేడు ప్రపంచం మొత్తం ఆయన కోసం మాట్లాడుకుంటోందన్నారు. ప్రతి ఒక్కరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సంస్థ ఉద్యోగు లందరూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, అంకిత భావంతో వినియోగదారులకు మరిన్ని ఉన్నత సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. హెచ్ఆర్డీ సీజీఎం అచ్చి రవికుమార్ అధ్యర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీజీఎంలు వి.విజయలలిత, డి.సుమన్ కళ్యాణి, ఓ.సింహాద్రి, ఎన్.మనిలామని, బి.రామచంద్రప్రసాద్, జె.శ్రీనివాసరావు, ఎం.రవీంద్ర, పి.శ్రీనివాస్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

విశాలాంధ్ర - భీమిలి : తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ది వస్ ను ఘనంగా నిర్వహించడం జరిగినది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందీ జాతీయ భాష దీనికి ఒక ప్రత్యేకత ఉంది ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న హిందీ దివస్ ను జరుపుకుంటారు . 1949వ సంవత్సరం సెప్టెంబర్ 14వ తేదీన హిందీ భాషను అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించింది అప్పటినుండి ఈ తేదీను హిందీ దివస్ జరుపుకోవడం ఆనవాయితీ అని అన్నారు. అదే విధంగా ప్రపంచ జనాభాలో మాట్లాడే నిష్పత్తిని ఆధారంగా చేసుకుని హిందీ భాష ద్వితీయ స్థానం కలిగి ఉన్నదని తెలిపారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయులు టి.ఎస్.వి. ప్రసాదరావు మాట్లాడుతూ శుద్ధ హిందీ భాషను రేడియోల్లో, టీవీ వార్తల్లో, వినవచ్చని తెలిపారు. ప్రస్తుతం చలామణిలో ఉన్న హిందీ భాష చాలావరకు సులబతరం చేయబడిందని తెలిపారు. ఉపాధ్యాయులు అప్పలనాయుడు, శేఖర్, శ్రీనివాసరావు, ప్రభావతి, విజయ్ కుమారి, సునీత, కామేశ్వరి, తారకేశ్వరరావు, దీనలత, కృష్ణకుమారి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్ బీమా అందజేత

విశాలాంధ్ర - మల్కాపురం : పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ అయినటువంటి ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు, 63వ వార్డ్ ఇంచార్జ్ పిలక రామ్మోహన్ రెడ్డి మరియు వార్డు అధ్యక్షులు సోమాదుల సురేష్ కుమార్ ఆధ్వర్యంలో కాకరలో గ్రామానికి సంబంధించి అంపోలు జ్యోతి యొక్క భర్తగారైన అంపోలు జోజు మరణించగా, మన వైయస్సార్ బీమా ద్వారా ముందుగా దహన సంస్కారాలకు పదివేల రూపాయలను అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వార్డు ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొట్నాన రవి, మరియు యలగాడ రాజు పునుకు రమణ, లోకొండ అప్పారావు కుమార్, సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ రాజు, రమణి, వాలంటీర్ అరుణ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 24 నుండి పవిత్రోత్సవాలు

విశాలాంధ్ర - సింహచలం : పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి పవిత్రోత్సవాలు సెప్టెంబర్ 5నుండి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబందించి వైదిక పెద్దలు, ఆలయ అధికారులు సిద్ధమౌతున్నారు. వచ్చే ఈ నెల 24వ తేది నుండి 28వ తేది వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నట్లు ఆలయ వైదిక, అధికార వర్గాలు తెలిపాయి. పవిత్రోత్సవం అంటే సాధారణంగా శుద్ధీకరణ ప్రక్రియ. సింహాద్రి నాధుని గర్భగుడి సమేతంగా ఆలయంలో సమస్త కోణాలను సంవత్సరంలో నాలుగు మార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అనే పేరున సుగంధ ద్రవ్యాలతో జరిగే శుద్ధీకరణ ప్రక్రియ భౌతికమైనది కాగా పవిత్రోత్సవం భావనాత్మకమైనది. చెన్నై నుంచి రూ. 20వేలు ఖర్చు చేసి రప్పించిన పవిత్రాలను అధికారులు, అర్చకులు నేడు పరిశీంచనున్నారు. పవిత్రాలను 8వ తేదీన విశేష హెూమాలు, పారాయణల అనంతరం రాత్రి సమర్పిస్తారు. అంతరాలయంతో పాటు దేవాలయంలో ఉన్న దేవతామూర్తులందరికీ పవిత్రాలను సమర్పిస్తారు. 9న ఉదయం విశేష హెూమాలు జరిపిన తర్వాత రాత్రి పూర్ణాహుతి నిర్వహించి పవిత్ర విసర్జన చేపడతారు. తేది,24.09.2023 నుండి తేది.28.09.2023 వరకు రాత్రి గం. 7.00ల తరువాత శ్రీస్వామి వారి దర్శనములు భక్తులకు అభించవు. శ్రీవారి పవిత్రోత్స వములు సందర్భంగా శ్రీస్వామి వారి ఆర్జిత సేవలైన నిత్యకళ్యాణం, స్వర్ణపుష్పార్చన, స్వర్ణతులసీదళార్చన సుప్రభాతసేన ఉదయం ఆరాధన, రాత్రి ఆరాధన సేవలు, శ్రీలక్ష్మీనరాయణ వ్రతములు జరుపబడవు, ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు జి. శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టి.పి రాజగోపాల్ మాట్లాడుతూ తొలిరోజు గంగధారనుండి పవిత్రజలంతో అప్పన్న ఆలయంలోని శుద్ధి మొదలౌతుందన్నారు . అనంతరం యాగశాలలో ఉదయం 7 గంటలకు హెూమాన్ని నిర్వహించి పవిత్ర ప్రతిష్ఠ చేస్తామని ప్రధాన అర్చక స్వాములు తెలిపారు . అనంతరం స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రెండో రోజు పవిత్రాల ఊరేగింపు, మూలవరులకు, ఉత్సవరులకు పవిత్రాల సమర్పణ కార్యక్రమం జరుగుతుంది. చివరిరోజు పూర్ణాహుతి, హెూమంతో ఈ ఉత్సవాలు సమాప్త మవుతాయని ఆయన తెలిపారు . పవిత్రోత్సవాలు సందర్భంగా స్వామివారికి భక్తులు కానుకలుగా సమర్పించిన బంగారు తులసి పత్రమాల స్వామివారికి, ఆండళ్ అమ్మవారికి బంగారు నగలును అలంకరించమని సహాయ కార్యనిర్వాహణాధికారి సూర్య భ్రమరాంబ అర్చక స్వాములుకు సూచనలు ఇచ్చారు.

ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరించిన గంటా

బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ నిర్వహించబోయే ఆత్మగౌరవ సభను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆత్మగౌరవ సభ పోస్టర్ను ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు చేతుల మీదుగా బి.వి.రామ్ ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీన తెలుగు శక్తి ఆధ్వర్యంలో నగరంలోని రామకృష్ణ బీచ్ లో నిర్వహించబోయే ఆత్మగౌరవ సభ ను విజయవంతం చేయడం ద్వారా ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మరింత స్పష్టంగా ఎండగట్టేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయానికి అన్యాయానికి మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించబోయే ఆత్మగౌరవ సభ ప్రభుత్వానికి కనువిప్పు అవుతుందని వ్యాఖ్యానించారు.

వినాయక చవితికి అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : వినాయక చవితి సంభరాలకి పోలీస్ల అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని జడ్డంగి ఎస్ఐ రఘునాధారావు తెలిపారు. మండపాలు, పందిళ్ళు వద్ద పోలీస్ అనుమతి పొంది స్పీకర్లను ఉపయోగించలని, ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, ప్రతిష్టించే విగ్రహం కొలతలు తెలపాలని, ఆ ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని, కమిటీ సభ్యుల పేర్లు, వినాయకుని ఊరేగింపు నిమజ్జన చేసే రోజు తెలియజేయాలని తెలిపారు.

దువ్వాడ స్టేషన్ మరింతగా అభివృద్ధి

విశాలాంధ్ర - కూర్మన్న పాలెం : దువ్వాడ రైల్వే స్టేషన్ భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చెందా నుందని ఉందని వాల్తేరు పూర్వ డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ సత్పతి అన్నారు. అయన సిపిటీఎంగా పదోన్నతి పొంది ఈస్ట్రాన్ రైల్వే జోన్ (కలకత్తా)కు బదిలీ అయిన సందర్భంగా దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కంచుమూర్తి ఈశ్వర్, వి. జాషువా, కె. వీర్రాజు, ఎం.ఎస్. ఎన్ మూర్తి రైల్ హౌస్ లో ఆయనను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దువ్వాడ అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక ఉందని త్వరలోనే ఆ ప్రాంత వాసుల కల సాకారం కావాలని కోరుకుంటున్నాను అన్నారు. సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. మీ ద్వారా రెండు రైళ్లు దువ్వాడ లో ఆగేలా కృషి జరిగిందని అందుకు కృతజ్ఞతలు తెలిపారు.తాంబ్రం-జసీడ్ (చెన్నై) సూపర్ ఫాస్ట్ రైలు తో పాటు మరిన్ని రైళ్లు దువ్వాడ లో ఆగేలా చూడాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

తవ్వేశారు.... వదిలేశారు ....

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం పట్టణంతో పాటు పలు ప్రధాన రహదారులను అభివృద్ధి పేరుతో తవ్వేశారు, పాదచారులు వాహనదారుల బాధలను గాలికొదిలేసారు. చోడవరం - అనకాపల్లి బి.ఎన్.రోడ్డు, వీటిని కలుపుతూ అంకుపాలెం, లక్ష్మీపురం రోడ్లను తవ్వేసారు. విద్యార్థులు, ఉద్యోగస్తులు, రైతన్నలు నిత్యం వేలాది మంది. ఈ రహదారుల్లో ప్రయాణిస్తుంటారు. ఇది వరకటి రోజుల్లో అడుగుకో గోయ్యిలతో నరకయాతన పడేవారు. వాటిని త్రోసి రాజంటూ అభివృద్ధి పేరుతో రహదారులన్నింటిని జె.సి.బి. యంత్రంతో తవ్వించేసారు. తవ్వి వారం అవుతున్నను, రహదారుల పునరభివృద్ధి కానరాక, ఈ రహదారుల్లో నిత్యం నరకయాతన అనుభవించవలసి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నేటికైనా పాలకులు, అధికారులు స్పందించి చోడవరం ప్రధాన రహదారి తో బాటు అంకుపాలెం, లక్ష్మీపురం, తదితర రోడ్లన్నీ తక్షణమే బాగు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పెన్షన్లను సద్వినియోగం చేసుకొండి

విశాలాంధ్ర - చింతపల్లి : వైకాపా ప్రభుత్వం నూత నంగా మంజూరు చేసిన పెన్షన్ల ను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లంబసింగి, పెదబరడ సర్పంచ్ లు అన్నారు. శుక్రవారం లంబసింగి పంచాయతీల పరిధిలో ఆ పంచాయతీ ఎంపీటీసీ సభ్యురాలు రావుల నాగమణి, మాజీ సర్పంచ్ రఘునాథ్ లతో కలిసి సర్పంచ్ శాంతి కుమారి నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా పెద బరడ పంచాయతీలో ఆ పంచాయతీ సర్పంచ్ సమిడ గోపాల్ ఆ పంచాయతీలో అర్హులైన వారికి నూతన పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలలో వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో పాటు, పెన్షన్లు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైకాపా అన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని ఎంతో మంది కి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేసి సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హత కల్పించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమాలలో ఆయా పంచాయతీల సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అర్హులైన లబ్ధిదారులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకి మద్దతుగా దీక్ష

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు అరెస్టుని వ్యతిరేకిస్తూ జీవీఎంసీ 87 వార్డు టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 87 వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు అక్రమం అని ప్రజాస్వామ్య వ్యవస్థ లో దుర్మార్గపు పాలనలో వ్యవస్థ నాశనం అవుతుంది అని అక్రమ అరెస్టులు, బెదిరింపులుకి టీడీపీ బయపడదని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఆయన్ని విడుదల చేసేవరకు నిరసనలు చేస్తూనే ఉంటామని ప్రజలు తప్పుడు కేసులకి భయపడకుండా రోడ్డు ఎక్కాలన్నారు.ఆయన అరెస్టు తో ఆయన చేసిన అభివృద్ధి బయటకు వస్తుంది అని దేశ వీదేశాల్లో ఆయనకి మద్దత్తు గా నిరసనలు తెలుపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రాజన్న రాజు,క్లస్టర్ ఇంచార్జ్ విజయరామరాజు,జిల్లా కార్యదర్శిలు కర్రీ కన్నారావు, కల్లేపల్లి శ్రీనివాస వర్మ, సీనియర్ నాయకులు వర్రే రాంబాబు,గెద్దాడ రాంబాబు, డీవీ సూరిబాబు,కణితి ఈశ్వరరావు, ఎస్.అప్పారావు, శాంతారావు. కల్లేపల్లి అశోక్ వర్మ, మూర్తి,జాన్ రమేష్, సూరిబాబు, పోతల కృష్ణ, భాగ్య లక్ష్మి, పెంటయ్య, కదుపుట్ల శ్రీను, అప్పలరాజు. సన్యాసి సన్యాసిరావు గారుతదితరులు పాల్గొన్నారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వినతి

విశాలాంధ్ర - పరవాడ : పరవాడ మండలం తానం గ్రామంలోకి కొండ గెడ్డ ద్వారా విష రసాయలను విడిచిపెట్టిన ఫార్మా యాజమా న్యాలపైనా, డెవలపర్గా ఉన్న రాంకీ యాజ మాన్యంపైనా విచారణ జరిపించి చర్యలు తీసుకో వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పరవాడ డిప్యూటీ తహసీల్దార్ శాంతి భూషణ్ కి వినతి పత్రం అందజేశారు. ఫార్మా కాలుష్యాన్ని నియంత్రించి తానాం గ్రామ ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని గనిశెట్టి కోరారు. స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే వ్యర్థ జలాలను ట్యాంకర్ల ద్వారా రాంకీ యాజమాన్యం కొంత తరలించిందన్నారు. మిగతా వ్యర్ధాలను కూడా తరలించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామంలోకి వ్యర్థ జలాలు రాకుండా భూగర్భ జలాలు నాశనం కాకుండా ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలని గనిశెట్టి కోరారు.

87వ వార్డులో డ్రైడే-ఫ్రైడే

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి శివారు ఎరుకుల కాలనీలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం జోన్ - 6 మలేరియా విభాగం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా జీవీఎంసీ అదనపు కమీషనర్ (ఎడీసీ) దాక్టర్ విశ్వనాధ సన్యాసిరావు, జెడ్సీ పొందూరు సింహాచలం పాల్గొని మాట్లాడుతూ డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులను నివారించవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ ఇంటిలోపల, పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు ప్రతీ శుక్రవారం అత్యవసరానికి సరిపడా మంచినీటిని ఉంచి మిగతా నీటిని తొలగించాలని అలా తొలగించిన నీటి పాత్రలను కొద్ది సమయం ఆరబెట్టిన తరువాత ఆయా పాత్రలను తాజా నీటితో నింపుకోవాలన్నారు. అలా నింపిన నీటిపాత్రలలో దోమలు ప్రవేశించకుండా మూతలు గాని వస్త్రం గాని కప్పవలెను. అదేవిధంగా ఇంట్లో లభ్యమయ్యే వ్యర్ధాలను తడి-పొడి చెత్తతో పాటు ప్రమాదకర చెత్తగా వేరుచేసి తమ గృహాలకు వచ్చే క్లాప్ వెహికల్స్ కు అందజేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించడం జరిగిందని ప్రజలంతా నిషేధిత ప్లాస్టిక్ కు స్వస్తిచెప్పి పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ హెల్త్ ఆఫీసర్ కిరణ్ కుమార్, మలేరియా ఇనిస్పెక్టర్ దొడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో స్వీకరించిన అర్జీలు పరిష్కారానికి శద్ధ పెట్టండి

కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : స్పందనలో స్వీకరించిన అర్జీలు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఓ . అభిషేక్ , డి ఆర్ ఓ పి. అంబేద్కర్ సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 85 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కొయ్యూరు మండలం రైతు ఉత్పతిదారుల సంఘానికి ఐతు ఉత్పత్తులు కలక్షన్ సెంటర్ నిర్మాణానికి కొయ్యూరు మండలం శరభన్న పాలెంలో 10 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలని సంస్థ చైర్మన్ పెదరాజ బాబు, డైరెక్టర్ ఎస్. సత్యనారాయణ వినతిపత్రం సమర్పించారు. పాడేరు మండలం లగిశపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని చెట్టి క్రాంతి వినతి పత్రం సమర్పించారు. జి.మాడుగుల మండలం చుట్టు మెట్ట గ్రామస్తుడు వంతాల కృష్ణారావు పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని వినతి పత్రం అందజేసారు. హుకుంపేట మండలం మతం పంచాయితీ ఎం. గన్నేరుపుట్టు గ్రామానికి చెందిన పొంగి క్రిష్ణ చైతన్య సికిల్ సెల్ ఎనిమియా పింఛను కోసం దరఖాస్తు చేసారు. ముంచంగి పట్టు మండలం బంగారుమెట్ట పంచాయత్ రావిడిపుట్టు గ్రామానికి తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు గుర్రం అర్జునరావు, పొంగి గురు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిద శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణ కొరకు తగు చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - రంపచోడవరం : ఏజెన్సీ పరిధిలో 11 మండలాలలో ఓటర్ జాబితాలో తప్పులు సరి చేయుటకు బూత్ స్థాయి అధి కారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల సవరణ కొరకు తగు చర్యలు తీసుకోవడం జరిగిందని రంప చోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ సవరణ ప్రక్రియ గురించి సబ్ కలెక్టర్ సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో 11 మండలాలలో ఎన్నికల సంఘం నిబంధన మేరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పేర్లు తప్పులు ఉన్న వాటిని సరి చేయుటకు బూత్ స్థాయి అధికారులను సర్వే చేయుటకు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఫారం 6 ద్వారా ఓటర్ల నమోదు కొరకు 809 దరఖాస్తులు. ఫారం7 ద్వారా చనిపోయిన వారి పేర్లు 754. ఫారం 8 ద్వారా ఓటర్ పేర్లలో తప్పులు. ఫోటోలు సరిగ్గా లేనియెడల సరి చేయుటకు 2582 దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముందు రోజు వరకు ఓటర్ల జాబితాలో ఏమైనా సమస్యలు ఉన్నాయెడల సంబంధిత ఫారములు ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రజలను ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్.బొజ్జి రెడ్డి. చిలకల సత్యనారాయణ. ముర్ల.కృష్ణారెడ్డి. శుభ కృష్ణ దొర. అనంత మోహన్. డిప్యూటీ తాసిల్దార్ యన్. వి.వి. సత్య నారాయణ. సీనియర్ అసిస్టెంట్లు డి.ఇందిరాబాయి. టి.లక్ష్మణ్. మణికంత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ అదనపు చార్జీలను రద్దు చేయాలి : సీపీఎం

చింతూరు - విశాలాంధ్ర : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజానీకానికి భారంగా ఉన్న నూతన విద్యుత్ విధానం తో అద నపు చార్జీలతో ప్రజలపై అదనపు భారం పడుతుందని తక్షణమే రద్దు చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సీసం, సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు సిపిఎం పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మండల కార్యదర్శి, సీసం సురేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా ప్రజలపై అనేక భారాలు పడుతున్నాయని నిత్యవసర వస్తువులు ధరలు, పెట్రోల్ డీజిల్ ధరలు ఒకవైపు ప్రభుత్వం విద్యుత్ అదనపు చార్జీలు మరోవైపు పెంచుతూ ప్రభుత్వం ప్రజలను నిత్యం బరాలు వేస్తుందని విద్యుత్ వినియోగదారులు గతంలో తమ వాడుకున్న విద్యుత్ పై సర్చార్జీల పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారని ఒకవైపు యూనిట్ చార్జీలను పెంచుతూ వినియోగ దారులపై భారాలు మోపడమే కాకుండా నేడు కార్పొరేట్ అధినేతగా ఉన్న హదానికి విద్యుత్ స్మార్ట్ మీటర్ల బాధ్యతను కేంద్ర ప్రభుత్వ చూసినతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై స్మార్ట్ మీటర్లు తప్పనిసరి అంటూ ఒత్తిడి తెస్తున్నారని ఈ చర్యలు తగదని అన్నారు సామాన్య ప్రజలు తమకు ఉచిత విద్యుత్ ప్రభుత్వాలు అందిస్తాయని ఆశగా చూస్తుంటే సబ్సిడీలు రానున్న రోజుల్లో పూర్తిగా రద్దయే ప్రమాదం ఉందని ప్రజలకు నష్టం చేసే నూతన విద్యుత్ విధానం పై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నానంటూ ప్రజలపై విపరీతమైన భారాలు మోపే కార్పొరేట్ విధానాలను ముందుకు తీసుకురావడం తగదని కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల సమస్యపై ప్రశ్నించాలని నిర్వాసితులను న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు, ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పల్లపు వెంకట్, మండల నాయకులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, సోడె సూరయ్య, గడ్డల రామయ్య, మడకం లక్ష్మణ్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.